క్లుప్తంగా

ప్రజా సంక్షేమమే ధ్యేయం

గంగాధర: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని గంగాధర మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని కురిక్యాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సోమవారం ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఇళ్లు లేని కుటుంబాలకు సొంతింటి కలను నిజం చేయడానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తుందన్నారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అర్హులకు ఇల్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కురిక్యాల గ్రామంలో అర్హులైన పది మంది లబ్ధిదారుల ఇళ్ల పనులు ప్రారంభించామన్నారు.

తాగునీటి కొరత రావొద్దు

హుజూరాబాద్: వేసవిలో తాగునీటి కొరత రాకుండా అధికారులు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ స్పష్టం చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. వేసవిలో గ్రామ, మండలాల్లో, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో తాగునీటి కొరత లేకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో బోరుబావులు చెడిపోయినా, మైనర్ రిపేర్లు ఉన్నట్లయితే అలాంటి వాటిని గుర్తించి మరమ్మతు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఫామ్‌పాండ్స్ పనులు



పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

శంకరపట్నం: మండలంలో ఈజీఎస్‌లో కూలీలు ఫామ్‌పాండ్స్, పంటపొలాలకు రోడ్లు, పశువుల పాకలు, కోళ్లఫాంల నిర్మాణాలు చేస్తున్నా రు. నీటిమట్టం పెంపొందించేందుకు సోమవారం మండలంలోని కేశవపట్నం శివారులో ప్రభుత్వ భూమిలో ఫామ్‌పాండ్ పనులు చేపట్టగా 63 మంది కూలీలు పనులు చేశారు. 510 మంది ఉపాధి కూలీలు మండల వ్యాప్తంగా పనులు చేశారని ఏపీవో శారద తెలిపారు.

విరాళం అందజేత



సర్టిఫికెట్స్‌తో విద్యార్థులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీప్రగతి స్కూల్ విద్యార్థులు రూ. 92,334 విరాళం సేకరించారు. హైదరాబాద్‌లో చూపు లేని వారికోసం ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని సోమవారం సంస్థ ప్రతినిధులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థవారు విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందించారు. స్కూల్ కరస్పాండెంట్ అన్నదానం రాధాకృష్ణ, నిర్వాహకులు విద్యార్థులను అభినందించారు.

చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న నాయకులు

మానకొండూర్: మండలంలోని చెంజర్ల, నిజాయితీగూడెం, ముంజంపల్లి, గంగిపల్లి తదితర గ్రామాలలో కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాయిరి దేవయ్య, తాళ్లపల్లి సంపత్‌గౌడ్, కుంబం చిరంజీవి, కానిగంటి మల్లికార్జున్, వంగల మధుసూదన్, కొమురయ్య, సంపత్, తిరుపతి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి


జమ్మికుంట: జమ్మికుంట మండలంలోని విలాసాగర్, గంద్రపల్లి, వావిలాల గ్రామాల పరిధిలోని మానేరు పరీవాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ పూల్లూరి స్వప్న సదానందం సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణాతో భూగర్భ జలాలు అడుగంటి పరివాహక ప్రాంతాల రైతుల పొలాలకు నీరు అందడం లేదని, ఇసుక తరలిస్తున్న క్రమంలో అతివేగంతో ట్రాక్టర్లు నడపడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, రెవెన్యూ, పోలీసు, మోటార్ వెహికిల్ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలం అయ్యారని, మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమర్‌రెడ్డి, కలెక్టర్, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ దృష్టికి తీసుకపోయి, ఇసుక రవాణా చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతామని పేర్కొన్నారు.

ఆశలు అడుగంటినట్టే..

- సాగునీటి కోసం రైతుల తంటాలు
- పెరుగుతున్న అప్పులతో ఆందోళన



ఖాదర్‌గూడెంలో ఎండిన మొక్కజొన్న



అడుగంటిన భూగర్భ జలాలు



క్రేన్ సాయంతో బావి నుంచి పూడికతీత

మానకొండూర్: కాలువ ద్వారా యాసంగిలో సాగునీరు అందుతుందని భావించిన మండలంలోని రైతుల ఆశలు అడుగంటినట్టే అనిపిస్తోంది. ఆరుతడి పంటలు కాకుండా ఆశతో వరిసాగు చేశారు. ఈసారి వరిసాగు విస్తీర్ణం కూడా ఘననీయంగా పెరిగింది. ఫిబ్రవరి నెలాఖరు వరకూ వ్యవసాయ బావుల నుంచి వరి పంటకు సాగునీరు అందినా మార్చి మొదటి వారంలోనే సాగునీటి సమస్య తీవ్రంమైంది. కాలువల ద్వారా సాగునీరు వస్తున్నా చివరి భూములకు చేరడంలేదు. సాగునీటి సమస్య ఉత్పన్నం అవుతుందని ముందే భావించిన రైతులు మళ్లీ అప్పు చేసి వ్యవసాయబావుల్లో సైడ్‌బోర్లు వేయించడం, బావులను మరింతగా లోతు తవ్వించడం, మూడు నాలుగు కిలోమీటర్లు దూరంలో ఉన్న కాలువల నుంచి పైపులైన్లు, మోటార్లు బిగించి సాగునీరు పంట పొలాలకు తరలిస్తున్నారు. రాత్రిపగలు సాగునీటి కోసం కష్టపడితే గాని పొలం తడవడం లేదు. మరో నెల వరకూ సాగునీరు అందితేనే పంట చేతికందుతుందని లేదంటే పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని నిజాయితీగూడెం, ఖాదర్‌గూడెం, చెంజర్ల, పెద్దూర్‌పల్లి గ్రామాలు మెట్ట ప్రాంతాలు. చిగురుమామిడి, తిమ్మాపూర్ మండలాల మీదుగా మానకొండూర్ మండలంలోని ఈ గ్రామాలకు కాలువలు తవ్వించి సాగునీరు అందేలా చర్యలు తీసుకున్నా ప్రస్తుతం సాగునీరు చివరి వరకూ అందడం లేదు. ఫిబ్రవరి నెలాఖరు నుంచే భూగర్భ జలాలు అడుగంటాయి. రెండు రోజుల తడిచొప్పున వరి పంటకు సాగునీరు వ్యవసాయబావుల నుంచి అందుతుండంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే మరో నెలపాటు సాగునీరు అవసరం తీరేదెలా అంటూ రైతులు కలవరపడుతున్నారు.

మళ్లీ పెరుగుతున్న అప్పులు

ఎకరం వరిసాగు రూ. ఇరవై వేలకు పైగా పెట్టుబడి పెట్టి వరి సాగుచేస్తే తీరా సమయానికి సాగునీరు అందడం లేదని, సాగునీటి కోసం వ్యవసాయ బావులను అప్పు చేసి మరింత లోతు తవ్వించాల్సి వస్తోందని విలపిస్తున్నారు. సాగునీటి కాలువలు పూర్తి స్థాయిలో తవ్వలేదని, కాలువలు పూర్తి స్థాయిలో తవ్వితే ఈ పరిస్థితి ఉండేది కాదని రైతులు అభిప్రాయ పడుతున్నారు. కాలువలు పూర్తి స్థాయిలో తవ్వి చివరి వరకూ సాగునీరు అందింతే కుంటలు, చెరువులు, బావుల్లో భూగర్భ జలాలు ఉండేటివని రైతులు అధికారులపై మండి పడుతున్నారు. పంటల సాగుకే ఇప్పటికే అప్పులు చేశామంటే పంటలను కాపాడుకునేందుకు మళ్లీ అప్పు చేయాల్సి వస్తోందని రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు.

ఎకరం పారడం లేదు

మూడెకరాలల్లో వరి సాగు చేశాను. అప్పుడు బావి నిండా నీరుండే. కొద్ది రోజులగా నీరు లోతుకు వెళ్లిపోయింది. ఇప్పటికే ఎకరం పొలం పారడం లేదు. రెండు రోజులకు ఒకతడి ఆరుతడి మాదిరి నీళ్లు అందిస్తున్నా, పంట చేతికందుతుందో లేదో తెలియదు. బావి తవ్వించేందుకు మళ్లీ అప్పు చేయాల్సి వస్తోంది.

– వరుకోలు ఎల్లయ్య, చెంజర్ల

తంటాలు పడుతున్నాం

వరి పొట్టదశలో ఉంది. ఇంకా నెల రోజులు సాగు నీరు కావాలి. వ్యవసాయబావులు అడుగంటి పోయాయి. రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్నా కాలువ ద్వారా పంట పొలాలకు నీరు అందిస్తున్నాం. సాగుచేసిన వరి పంట ఎండిపోయే అవకాశం ఉంది. పంటను కాపాడుకోవడానికి సాగు నీరు కోసం తంటాలు పడుతున్నాం.

– దొంగల సంపత్, నిజాయితీగూడెం

రాత్రీపగలు పొలంకాడే

వరి పొలానికి సాగునీరు అందించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. బావులు మరింతగా లోతు తవ్వాల్సి వస్తోంది. పంట సాగుకు పెట్టుబడి పెట్టాం, మళ్లీ బావులు తవ్వించడానికి అప్పు చేయాల్సి వస్తోంది. రాత్రీపగలు పొలం వద్దే ఉండాల్సిన పరిస్థితి, కాలువలు పూర్తి స్థాయిలో తవ్వించి సాగు నీరు అందించాలి.

– వరుకోలు బాలయ్య, చెంజర్ల

ఇబ్బందులు తొలగించండి





శంకరపట్నం: మండలంలోని తాడికల్ నుంచి కొత్తగట్టు వరకు జాతీయ రహదారి వెంబడి ప్లాట్స్ కొనుగోలు చేసిన సామాన్యులు, రైతుల నుంచి ఎన్‌హెచ్–563 బైపాస్, ఫ్లైఓవర్, రోడ్డు నిర్మాణం కోసం మూడేళ్ల క్రితం ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. రైతులు పంట పొలాలు, సామాన్యులు ప్లాట్స్ భూసేకరణలో కోల్పోయారు. పరిహారం నామమాత్రం చెల్లించగా మిగిలిన ప్లాట్లకు జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు నుంచి వెళ్లకుండా మొలంగూర్, కేశవపట్నం, కొత్తగట్టు, గొల్లపల్లి, తాడికల్‌లో గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. గ్రిల్స్ ఏర్పాటుతో ప్లాట్లకు వెళ్లకుండా ఇబ్బందులు పడతామని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రిల్స్‌ను తొలగించాలని కోరుతున్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



రామడుగు: అభినందిస్తున్న ఎమ్మెల్యే సత్యం

రామడుగు: మండలంలోని వెలిచాల సరస్వతి స్కూల్ విద్యార్థులను సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు. పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు స్టేట్ లెవల్ తైక్వాండో కరాటే పోటీల్లో మెడల్స్ సాధించారు. ఈగ అశ్విత్‌కుమార్, బండపల్లి మేఘన, రేగూరి శ్రీహాసిని, పెద్దిగారి సింధు బంగారంతోపాటు ఇతర పతకాలు సాధించారిని స్కూల్ కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు. ప్రతి విద్యార్థి కరాటే నేర్చుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్సింగరావు, స్కూల్ కో కరస్పాండెంట్ సత్యం, కోచ్ శరత్ పాల్గొన్నారు.

చొప్పదండి: ఉమ్మడి జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో మండలంలోని ఆర్నకొండ అక్షయ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. నాలుగు జిల్లాల నుంచి సుమారు 270 మంది క్రీడాకారులు పాల్గొనగా పాఠశాలకు చెందిన మన్విత్, వర్షిని, అమూల్య, రిషిరాం, కుమారస్వామి బంగారు, గణసాయి నాయక్, సిల్వర్ మెడల్, ఇన్‌షా వలి, సుకాంత్, నితీశ్, శ్రేయాష్ కాంస్య పతకాలు సాధించారు. క్రీడాకారులను కరస్పాండెంట్ తమ్మడి శ్రీమతి, కోచ్ నాగమణి అభినందించారు.

వైభవంగా గ్రామదేవతల విగ్రహాల ఊరేగింపు



వీణవంక: ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

వీణవంక: మండలంలోని బేతిగల్ గ్రామంలో భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి, పోచమ్మ విగ్రహాల ఊరేగింపు సోమవారం గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపు నిర్వహించగా మహిళలు మంగళహారతులతో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు, గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు శంభుస్వామి జాతర



చొప్పదండి: ముస్తాబైన శివకేశవాలయం

చొప్పదండి: పట్టణంలోని శివకేశవాలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జాతరకు ముస్తాబైంది. ఫాల్గుణ శుద్ధ పంచమిని పురస్కరించుకొని ఏటా నిర్వహించే శంభుస్వామి జాతరకు భక్తులు భారీగా తరలివస్తారని నిర్వాహకులు, వివేకానంద యూత్ క్లబ్ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శివుడు, కేశవుడు ఎదురెదురుగా దేవాలయాలు కలిగి ఉన్న ఈ అరుదైన ఆలయానికి వెయ్యేళ్ల చరిత్ర ఉంది. కళ్యాణి చాళుక్యుల పరిపాలనలో ఆలయాన్ని నిర్మించారని శాసనాలు చెబుతున్నాయి. విశాలమైన ప్రకారాల మధ్య రాతితో నిర్మించిన ఈ ఆలయంలో శివుడి ఆలయం తూర్పు ముఖంగా, కేశవుడి ఆలయం పడమర ముఖంగా ఉంటాయి. పక్కనే వీరభద్ర స్వామి ఆలయం ఉంది. మహాశివరాత్రి నుంచి జాతర ఉత్సవాలు కొనసాగుతుండగా మంగళవారం రథయాత్ర జరుగనుంది. ఆలయ వంశపారంపర్య అర్చకులతో పాటు స్థానిక వివేకానంద యూత్ క్లబ్ సభ్యులు ఏటా జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రమేశ్

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణను ప్రిన్సిపల్ డా. రమేశ్ సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ..ప్రస్తుతం కంప్యూటర్ విద్యకు ప్రాధాన్యత ఉందని, నెలరోజుల పాటు విద్యార్థులకు ఎంఎస్ వార్డు, ఎక్సెల్, పవర్‌పాయింట్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఓదెల్‌కుమార్, కంప్యూటర్ విభాగం ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, అధ్యాపకులు సుష్మా రవిప్రకాశ్, రమేశ్ విద్యార్థులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్ తరలింపు విరమించుకోవాలి

హుజూరాబాద్: మడికొండ గ్రామంలోని డంపింగ్ యార్డ్‌ను హుజూరాబాద్‌లో ఏర్పాటు చేద్దామనే ప్రతిపాదనను విరమించుకోవాలని హుజూరాబాద్ ప్రజాసంఘాల నాయకులు వేల్పుల రత్నం, పాక సతీష్, వేల్పుల ప్రభాకర్, డాక్టర్ తడికమళ్ల శేఖర్, మార్త రవీందర్, తునికి సమ్మయ్య, సందెల వెంకన్న,ఇమ్మడి దయాకర్, రామ్ రాజేశ్వర్‌లు సోమవారం ప్రకటనలో తెలిపారు. మడికొండ ప్రజలు వ్యతిరేకించగా డంపింగ్‌యార్డ్‌ను అధికారులు చాకచక్యంగా హుజూరాబాద్‌కు తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దీనివల్ల హుజూరాబాద్ చుట్టూ పది గ్రామాల ప్రజలకు తీవ్రమైన విఘాతం కలుగుతుందన్నారు. భూమి, భూగర్భ జలాలు, వాతావరణం కాలుష్యంతో వ్యవసాయ పంటలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు.

ప్రకృతి వనంలోని చెట్లు దగ్ధం



మానకొండూర్: గన్నేరువరం మండలం మైలారంలోని పల్లె ప్రకృతి వనానికి ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో పల్లె ప్రకతి వనం పాక్షికంగా దగ్ధమైంది. ఘటన స్థలాన్ని సోమవారం ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. ఆకతాయిలు నిప్పంటించడంతో సుమారు 200 చెట్లు కాలిపోయాయని తెలిపారు.

అదనపు కట్నం కేసు

జమ్మికుంట: అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేశామని జమ్మికుంట టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు. మండలంలోని గోపాలపురంకు చెందిన వనజకు పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం ఇందుర్తికి చెందిన ఎలకపల్లి రాజశేఖర్‌తో 2022లో పెళ్లి జరిగింది. కట్నకానుకలిచ్చి వివాహం జరిపించారు. కొంతకాలంగా భర్త అదనపుం కట్నం తీసుకురావాలని వేధిస్తూ, దాడికి పాల్పడ్డాడని బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

ప్రైవేట్ బస్సును ఢీకొని కారు బోల్తా

మానకొండూర్: ప్రైవేటు బస్సును ఢీకొని ఓ కారు బోల్తా పడింది. లోపల ఉన్నవారికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. కరీంనగర్‌లో సోమవారం ఎమ్మెల్సీ ఓట్ల కౌంటింగ్‌లో భాగంగా సిద్దిపేట నుంచి ఐదుగురు ఉపాధ్యాయులు కారులో బయలుదేరారు. మార్గమధ్యలో గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి స్టేజి వద్ద హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సును ఓవర్‌టేక్ చేస్తూ ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారు బోల్తా పడింది. లోపల ఉన్న ఐదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయని గ్రామస్తులు తెలిపారు. హుజూరాబాద్ మండలం రాజపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ హైమద్ (32) బైక్‌పై కేశవపట్నం వచ్చి తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలో కొత్తగట్టు గ్రామంలో బైక్ అదుపుతప్పడంతో రోడ్డుపై పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 సమాచారం అందించారు. ఈఎమ్‌టీ సతీశ్‌రెడ్డి ప్రథమచికిత్స చేసి హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఏడీఈ , తదితరులు

జమ్మికుంట: జమ్మికుంట రైల్వేస్టేషన్ ఆవరణ నుంచి జమ్మికుంట, కొత్తపల్లి వరకు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం రామగుండం రైల్వే ఏడీఈ (అసిస్టెంట్ అడిషనల్ ఇంజినీర్) మనోజ్‌కుమార్ గుప్తా సోమవారం స్థల పరిశీలన చేశారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌కు పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న, హుజూరాబాద్ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ సలీంపాషా గతనెల 28వ తేదీన వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. ఎంపీ ఈటల వెంటనే రామగుండం ఏడీఈ, రైల్వే అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని చేసిన సూచనల మేరకు జమ్మికుంట రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థలం, కొత్తపల్లి గ్రామస్తుల ఇబ్బందులు, సమస్యలతోపాటు కొత్తపల్లి వైపు టికెట్ బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, ఎస్కులేటర్ సౌకర్యం కల్పించాలని కోరారు. అధికారులు మ్యాప్ సిద్ధం చేసి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎర్రబెల్లి సంపత్‌రావు, శీలం శ్రీనివాస్, జీడి మల్లేశ్, మోతె స్వామి, ఇటిక్యాల స్వరూప కొత్తపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందించాలి



ఈఈకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గంగాధర: మండలంలోని మోతె వాగుకు నారాయణపూర్ రిజర్వాయర్ నీటిని విడుదల చేసి చివరి ఆయకట్టుకు సాగు నీరందించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్‌యాదవ్ డిమాండ్ చేశాడు. నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రామడుగు మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో నాయకులు, రైతులు సోమవారం నారాయణపూర్ మత్తడి వద్దకు చేరుకున్నారు. మత్తడికి అడ్డుగా ఉన్న మట్టికట్టను తొలగించారు. విషయం తెలుసుకున్న నీటిపారుదలశాఖ అధికారులు పోలీసులు చెరువుకట్ట వద్దకు చేరుకున్నారు. చెరువులోని నీటిని కాలువల ద్వారా మాత్రమే పంటపొలాలకు అందిస్తామన్నారు. కాలువల నిర్మాణాలకు మేము భూములు ఇస్తే మాకు సాగు నీరు ఇవ్వరా అని రైతులు నిలదీశారు. ఎగువ ప్రాంత నాయకులు పంపింగ్ ద్వారా నీరు తరలించుకుపోతుంటే మా ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని, ఓ వైపు మోతెవాగుకు నీటిని విడుదల చేస్తున్నామని ఎమ్మెల్యే ప్రకటనలు చేస్తుంటే ఇక్కడ నీరు విడుదల చేయకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. కొద్ది రోజులుగా పంపింగ్ ద్వారా నారాయణపూర్ రిజర్వాయర్‌కు వస్తున్న నీటిని అధికారులు నిలిపేశారు. మోతె వాగుకు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు బీజేపీ నాయకులతో కలిసి నీటిపారుదలశాఖ ఈఈ శ్రీనివాస్‌గుప్తాకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో మాత్రమే అధికారం కోసం చివరి ఆయకట్టుకు నీరందిస్తామని అధికారంలోకి వచ్చాక అధికారులు ఒక తీరు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, నాయకులు మరోతీరుగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శనలు చేస్తామనే భయంతో ఆదివారం రాత్రి కాంగ్రెస్ నాయకులు నారాయణపూర్ మత్తడి వద్ద అడ్డుగా ఉన్న కట్టకు గండిపెట్టి మోతెవాగుకు నీటి విడుదల చేశారని, ఇదే విధంగా చివరి ఆయకట్టుకు నీటిని విడుదల చేయకుంటే రైతులతో కలిసి గండికొడతామన్నారు.

నీరు విడుదల

రామడుగు: గంగాధర మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి మోతె వాగులోకి సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నీటిని విడుదల చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందనిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వాగులోకి నీటిని విడుదల చేయాలని కోరారు. అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయాలని సూచించారు. దీంతో సోమవారం రిజర్వాయర్ నుంచి వాగులోకి నీటిని విడుదల చేశారు. మోతె వాగు వెంట ఉన్న పలు గ్రామాల రైతులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హైనా దాడిలో లేగదూడ మృతి



చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్‌లో హైనా దాడిలో ఓ లేగదూడ మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. చీకట్ల రాజు తన ఆవు, లేగదూడను ఆదివారం రాత్రి పశువుల పాకలో కట్టేసి, ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం వెళ్లి చూడగా లేగదూడ చనిపోయింది. దానిపై తీవ్ర గాయాలుండటంతో హైనా దాడి చేసి, చంపిందని తెలిపాడు. స్థానిక పశువైద్యాధికారి సాంబరావు, ఫారెస్టు అధికారి శేఖర్‌లకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించారు. తనను ఆదుకోవాలని రాజు కోరాడు.

ఎస్టీ వర్గీకరణ చేపట్టాలి



మాట్లాడుతున్న లోకిని రాజు, నాయకులు

హుజూరాబాద్: ఎస్టీ వర్గీకరణ చేపట్టాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అత్యధిక జనాభా ఉన్న లంబాడీలను కోయ, గోండులను పరిగణనలో తీసుకొని ఎస్టీ వర్గీకరణ చేస్తే ఆదివాసీ ఎరుకలకు అన్యాయం జరుగుతుందన్నారు. విద్యా, ఉద్యోగ పరంగా, ఆర్థిక, సామాజిక, రాజకీయంగా అభివృద్ధి చెందని ఆదివాసి ఎరుకలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. రాజ్యాంగం, సుప్రీంకోర్టు సూచించిన సామాజిక ప్రాథమిక సూత్రాలను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చెందని ఆదివాసీ తెగలను గుర్తించి, అన్ని విధాలుగా ఆలోచించి ఎస్టీ ఏబీసీడీ వర్గీకరణ చేపట్టి న్యాయం చేయాలన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం



చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ఐదోతరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హర్జిత్ కౌర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. అలాగే ఏడు నుంచి పదో తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకోసం ఆన్‌లైన్‌లో 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.